# నేను నేనే-3

Index page no


| Index | page no |
|---|---|
| 41. భక్తి-ప్రేమ; వ్యాకోచించు-సంకోచించు | 2 |
| 42. ఆలోచన-ఆకాశం-నవశిశువు | 3 |
| 43. నియతి-పురుషకారం | 5 |
| 44. తలుపులు-తాళం-తాళంచెవి | 7 |
| 45. ఆకాశ-సాధన | 9 |
| 46. గురుదృష్టి-దైవదృష్టి | 10 |
| 47. 'నిత్యఎరుక' యే నిత్యమెలకువ | 11 |
| 48. శివోహం... శివోహం... | 12 |
| 49. మతం | 12 |
| 50. గురువు | 14 |
| 51. అల్పత్వం | 16 |
| 52. మోక్షం | 17 |
| 53. ఉనికి | 19 |
| 54. పగటి కల | 21 |
| 55. బహిర్ముఖం-అంతర్ముఖం | 24 |
| 56. త్రిగుణాతీతుడు | 25 |
| 57. తారుమారు | 28 |
| 58. మొదటి నేను-రెండవ నేను | 32 |
| 59. సాక్షాత్కారం-భగవంతుని శరీరమే ఈ ప్రపంచం | 34 |
| 60. ప్రధమస్థానం | 36 |
| 61. కర్త-కర్మ-క్రియ | 39 |
| 62. విసుగుదల (boredom) | 41 |
| 63. సృష్టి ఎందుకు? | 43 |

41. భక్తి-ప్రేమ; వ్యాకోచించు-సంకోచించు

వ్యక్తి మీద భక్తి - ప్రేమ.

దేవుని మీద ప్రేమ - భక్తి.

ప్రేమ చినమాయ...

భక్తి పెనుమాయ...

బంధం లేని ప్రేమ ఆమోదయోగ్యమైనది...

కోరిక లేని భక్తి ఆమోదయోగ్యమైనది...

బంధం లేని ప్రేమ - సుఖం...

కోరిక లేని భక్తి - మోక్షం...

బంధం-కోరిక వల్లనే దుఃఖం...

బంధం-కోరిక అనంతమైనప్పుడు సుఖం...

ప్రేమను, భక్తిని అధిగమించి...

'జ్ఞా' నంలోకి ప్రవేశించాలి...

కళ్ళు పైకెత్తావా...

అంతు దొరకని అనంతాకాశం...

చూపు లోనికి దించావా...

లోతు దొరకని చిదాకాశం...

నీకు నీవు తోచనంతగా...

అటైనా వ్యాకోచించు...

ఇటైనా సంకోచించు...

అనంతమై...

లేదా...

సూక్ష్మమై...

తనకు తాను తోచనివాడే పరమాత్మ...

సమస్తాన్ని తనలో కలిగిన వాడే పరమాత్మ...

నేను ప్రపంచంలో ఉన్నాను అంటే బంధం...

నాలో ప్రపంచం ఉంది అని అంటే మోక్షం.

**********************

42. ఆలోచన-ఆకాశం-నవశిశువు

ఆలోచన లేని స్థితి కలగాలంటే ఏం చేయాలి?

శూన్య స్థితి కలగాలంటే ఏం చేయాలి?

మానసిక ప్రశాంతత కలగాలంటే ఏం చేయాలి?

మోక్షం పొందాలంటే ఏం చేయాలి?

ఏదో ఒకటి చేస్తే కానీ పొందలేం...

అన్న తప్పుడు ఆలోచనలు పోవాలి ముందు...

లౌకికవ్యవహారాల్లో ప్రయత్నం అవసరం...

ఆధ్యాత్మిక విషయంలో ప్రయత్నం ఆటంకం...

"ఆలోచన లేని స్థితి" కలగాలి అనేది కూడా ఒక ఆలోచనే...

మోక్షం పొందాలనుకోవడం కూడా ఓ బంధమే...

"ఉన్న" స్థితిలో ఉండడమే "ఉన్నత స్థితి"...

ఉన్న స్థితిని త్రోసివేయకుండా...

లేని స్థితిని కోరకుండా...

ఉండగలిగితే అదే ముక్త స్థితి...

మబ్బులు వస్తుంటాయి... పోతుంటాయి...

ఆకాశం వాటిని అంటక ఉంటుంది...

నీవు ఆకాశంలా ఉండు...

ఆలోచనలకు ప్రాముఖ్యత ఇవ్వకు...

ప్రాముఖ్యత ఇవ్వకుంటే...

ఆలోచనలు ఉన్నా లేనట్టే...

వ్యక్తి అనేది ఒక ఆలోచన...

జగత్తు అనేది ఒక ఆలోచన...

దేవుడు అనేది ఒక ఆలోచన...

"ఇలా ఉండాలి" అనే ఆలోచన ఒకటే...

"ఇలా ఉండకూడదు" అనే ఆలోచన కూడా ఒకటే...

రెంటికీ అలసట తప్పదు...

"మొత్తం ఆలోచనే" అని త్రోసివేయి...

ప్రశాంతంగా ఉండాలి అనే ఆలోచన...

నీ సహజ ప్రశాంతతను చెడగొడుతోంది...

మనసులో ఏదైనా ఉండనీ... ఏదైనా పోనీ...

"ఉన్న స్థితి" లో ఉండు...

ఆకాశానికి...

తెల్ల మబ్బు అయినా ఒకటే...

నల్ల మబ్బు అయినా ఒకటే...

నీవు ఆకాశం వలే ఉండు...

మంచి ఆలోచన వలన బలము రాదు...

చెడు ఆలోచన వలన క్షీణమూ రాదు...

నీవు నవశిశువు వలె ఉండు...

***********************

43. నియతి-పురుషకారం

"నేను" (పరమాత్మ) అనే అద్భుతబీజం...

నేనుగా(జీవుడిగా) మొలకెత్తుతుంది...

విశ్వవృక్షంగా(ప్రపంచంగా) విస్తరిస్తుంది...

వ్యక్తిగా(నామరూపాత్మకమైన శరీరంగా)...

మొగ్గ తొడుగుతుంది...

జీవితంగా వికసిస్తుంది...

జ్ఞాన-విజ్ఞానాలతో పరిమళిస్తుంది...

మోక్షంగా ఫలిస్తుంది...

ఆత్మగతమైన నేను వ్యక్తిగతమైన నేనుగా...

వ్యక్తిగతమైన నేను ఆత్మగతమైన నేనుగా...

మారుతూ ఉండడం ఈశ్వర నియతి...

ఎరుకతో ఉంటే ఆ నియతి - ధర్మచక్రం.

ఎరుక లేకుంటే ఆ నియతి - సంసారచక్రం.

సుఖదుఃఖాలు నేను ఎందుకు పడాలి?

అని జీవుని ప్రశ్న?

ఈశ్వరుడు అంటున్నాడు...

శిలను, ఉలిని నీకిచ్చాను...

ఏ శిల్పాన్నైనా మలచుకునే...
శక్తిని, బుద్ధిని నీకిచ్చాను...
ఇచ్ఛను, స్వేచ్ఛను నీకిచ్చాను...
ఆ శిలలో ఏ శిల్పాన్ని మలచుకుంటావో...
నీ ఇష్టం...

నీ సుఖదుఃఖాలకు...
నీవు ప్రత్యక్షకారణం...
నేను పరోక్షకారణం...
నీ ఇచ్ఛా ఉంది...
నా ఇచ్ఛా వుంది...
నీ ఇచ్ఛాశక్తికి  పురుషకారం అని పేరు...
నా ఇచ్ఛాశక్తికి నియతి అని పేరు...
ఇద్దరమూ ఏ ఇచ్ఛా లేక ఊరక ఉంటే...
జగన్నాటకం జరిగేదెట్లా అయ్యా...!

నాటకం అని తెలిస్తే మోక్షం.
నాటకం అని మరిస్తే బంధం.
లోకవత్ లీలా కైవల్యం...
**************************

44. తలుపులు-తాళం-తాళంచెవి

అది చీకటి రాత్రి...
ఊరిచివర ఉన్న ఓ ఇంటి తలుపులకు...

పెద్ద తాళంకప్ప వేసుంది...

ఓ దొంగ లోపలకు ప్రవేశించాలని చూశాడు...

తనవద్ద ఉన్న రకరకాల తాళంచెవులతో...

ఆ తాళం తెరవడానికి ప్రయత్నించాడు...

ప్రయత్నం సఫలం అయింది...

తలుపులు తెరిచి చూసి అవాక్కయ్యాడు...

అంతా మైదానం...

ఆ ఇంటికి ఆ తలుపులు తప్ప గోడలే లేవు...

ఈ ఆధ్యాత్మిక సాధనలన్నీ అలాంటివే...

ఒక్కొక్క తాళం చెవి ఒక్కొక్క రకం సాధన...

ప్రతి సాధనా చివర్లో హాస్యాస్పదంగా ఉంటుంది..

ఎటైనా లోపలికెళ్లే శూన్యభవనం సత్యం...

ద్వారంతో (గురువుతో)...

తాళంతో (సాధనతో)...

అవసరం లేకుండా...

ఏ క్షణమైనా...

ఎటు ప్రక్కనుంచైనా...

సత్యాన్ని చేరుకునే అవకాశం ఉంది...

Truth is Pathless Land...

అంత సులభంగా చేరుకోవడం మనకే ఇష్టం లేక...

మనమే కావాలనే విషయాన్ని జటిలం చేసుకున్నాం...

ఎల్లలు(హద్దులు) లేని సత్యంలో...
మనమే ఓ భవనం నిర్మించుకున్నాం...
తలుపులు వేసుకున్నాం...
తాళం బిగించుకున్నాం...
మళ్లీ దానిని తెరవడానికి...
ఏవేవో సాధనలు చేస్తున్నాం...

ముల్లును మరో ముల్లుతో తీసి వేసినట్లు...
బంధం అనే భ్రమను...
సాధన అనే మరో భ్రమతో...
పోగొట్టే ప్రయత్నమే ఆధ్యాత్మికం...

సత్యం అనేది...
అప్పుడు-ఇప్పుడు అనక సదా ఉన్నది...
అక్కడ-ఇక్కడ అనక అంతటా ఉన్నది...
అది-ఇది అనక సర్వమూ తానే అయి ఉన్నది...
***********************

45. ఆకాశ-సాధన

శరీరం, మనసు, హృదయం మరియు ఆత్మను దాటి పరమాత్మ వద్దకు చేరాలంటే, మీలో వస్తున్న ఆలోచనలకు ప్రభావితమవుతూ ఒక బంధీలా జీవిస్తున్నారని ముందు మీరు గుర్తించాలి.

తర్వాత దృష్టిని ఆలోచనల నుంచి మీ వైపు తిప్పి, మిమ్మల్ని మీరు కరిగించుకోవడానికి సాధన చేయండి. మీలో ఏమి జరుగుతున్నా దాంట్లో ఏమాత్రం పాల్గొనకుండా, కేవలం మీరు మాత్రమే మంచు ముక్కలా కరిగిపోయి నిరాకారమైన తర్వాత, వ్యాపించి అలానే ఉండిపోండి.

అంటే మంచి-చెడు మాటలకు, ఆలోచనలకు, ఏ మాత్రం ప్రాధాన్యత ఇవ్వకుండా, కేవలం నేను విశ్వమంతా వ్యాపించి ఉన్నాను అని కొద్దిసేపు ఊహించుకుని అలా నిశ్చలంగా ఉండండి.

లేదా శరీరాన్ని వదిలేసి, ఒక్క అడుగు వెనక్కి వేసి నిరాకారమై ఆకాశంతో ఏకమవ్వండి. అంటే మీరు శరీరం నుంచి బయటికి వచ్చి సూక్ష్మ శరీరంతో స్వర్గానికో లేదా సత్యలోకానికో లేదా మీకు నచ్చిన ఇతర లోకాలకు వెళ్లాలని చూడకుండా, మీకు నచ్చిన దేవీదేవతలను కలవడానికి చూడకుండా, ఆ సూక్ష్మ శరీరాన్ని కారణ శరీరాన్ని కూడా వదిలేసి, మంచి-చెడు లోకాలు దేనిలో అయితే ఉన్నాయో, ఆ ఆకాశంతో ఏకమవ్వండి.

అంటే అంతరిక్షంలోని గ్రహాలలో నక్షత్రాలలో ఏమి జరుగుతున్నా, వాటిని ఏమాత్రం పట్టించుకోకుండా, వాటన్నింటినీ ముందే అంటీ ముట్టనట్టుగా వ్యాపించి ఉన్న ఆకాశంతో మీరు ఏకమవుతారు. అంటే అప్పుడు మీలో జీవజగదీశ్వరులు ఉంటారన్నమాట.

ఈ స్థితిలో మీరు కొద్ది సమయం ఉండగలిగితే, జీవజగదీశ్వరులు వాటంతట అవే కరిగిపోయి, నేను లేదా నిశ్శబ్ధం లేదా నిశ్చలం లేదా సచ్చిదానందస్వరూపం లేదా బ్రహ్మానందం లేదా తురీయస్థితి మిగిలి ఉంటుంది.

కొంత సమయం ఆ స్థితి కొనసాగిన తర్వాత దానంతట అదే మెలకువ వస్తుంది. అప్పుడు మీరు వెంటనే కళ్ళు తెరవకుండా ఈ బ్రహ్మానందాన్ని మీ అన్నీ భాగాలకు, అలాగే విశ్వమంతా వ్యాపింప చేయండి.

అనగా అప్పుడు విశ్వ శరీరమే మీ శరీరం అవుతుంది. అంటే ఆకాశమే మీ చర్మంగా అందులో ఉన్న గ్రహాలు నక్షత్రాలు మిగతావన్నీ మీ భాగాలుగా ఉంటాయన్నమాట.

దీని వలన మీ అన్ని భాగాల మధ్య, ఆలోచనల మధ్య, గుణాల మధ్య, లోపల-బయట ఉన్న పాత్రల మధ్య, మంచి-చెడు లోకాల మధ్య, పంచభూతాల మధ్య, సమన్వయం ఏర్పడి, మీకున్న అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.

ఈ ధ్యానాన్ని ఎవరైనా, ఎప్పుడైనా, ఎక్కడైనా, ఏ సమయంలోనైనా, ఎంత సమయమైనా చేసుకోవచ్చు.

******************

46. గురుదృష్టి-దైవదృష్టి

గురువు గురువుగా
శిష్యుడు శిష్యుడుగా
అనిపిస్తున్నంతకాలం
సత్సంగం అవసరమే.

* * *

దేవుడు దేవుడుగా
జీవుడు జీవుడుగా
అనిపిస్తున్నంతకాలం
దేవాలయం అవసరమే.

* * *

గురు-శిష్య భేదం తొలగడమే
సత్సంగ ప్రయోజనం నెరవేరినట్లు.

* * *

జీవ-దేవ భేదం తొలగడమే
దేవాలయప్రయోజనం నెరవేరినట్లు.

* * *

గురుదృష్టి అంటే

ఎవర్ని చూసినా గురువుగానే కనబడడం.

దైవదృష్టి అంటే

ఎవర్ని చూసినా దేవుడుగానే కనబడడం.

********************

47. 'నిత్యఎరుక' యే నిత్యమెలకువ.

నిత్యమెలకువయే నిత్య జాగరణ.

శివరాత్రి అంటే-

ఎరుకతో కూడిన నిద్ర.

నిద్రతో కూడిన మెలకువ.

అట్టి నిద్రను, అట్టి మెలకువను

ఏకకాలంలో స్వరూపంగా కలిగి ఉండడం...

ఒక్కనికే సాధ్యం...

ఆ ఒక్కడే శివుడు... నా దేవుడు...

********************

48. శివోహం... శివోహం...

నేను శివుణ్ణి ధ్యానిస్తున్నాను...

అని కాకుండా...

తననే శివుడుగా భావిస్తూ...

శివుడే ధ్యానిస్తున్నాడు...

అని చేసే ధ్యానమే 'సత్' ఫలితాన్నిస్తుంది.

శివోహం...

శివోహం...

శివోహం...

*********************

49. మతం

ప్రతిమతంలోనూ...

కర్మకాండ...

జ్ఞానకాండ...

రెండూ ఉంటాయి...

కర్మకాండ ఆచరణకు సంబంధించినది...

జ్ఞానకాండ అనుభవానికి సంబంధించినది...

ఒకటి సాంఘీకం...

ఇంకొకటి ఆధ్యాత్మికం...

మతభేదాలుండేది కర్మకాండలోనే...

అనుభవంలో ఏ తేడాలూ ఉండవు...

అక్కడ అన్ని మతాలూ ఒక్కటే...

అసలక్కడ ఏ మతమూ ఉండదు...

ఒక్కొక్క చోట ఒక్కోరకమైన ఆహారం ఉంటుంది...

అందరికీ ఆకలి తీరాక ఉండే తృప్తి ఒక్కటే...

ఏదో ఒక మతస్తుడిగా పుట్టడం సహజం...

అదే మతస్తుడిగా చనిపోవడం దురదృష్టకరం...

మతాతీతుడు కావాలన్నదే సారాంశం...

అటువంటి అద్వైతస్థితికి
ప్రతి ఒక్కరూ చేరాలన్నదే...
ప్రతి మతం యొక్క అభిమతం...

మనమందరం కర్మకాండ వద్దనే ఆగిపోయి...
కొట్టుకు చస్తున్నాం...
భౌతిక-మానసిన పరిధులను దాటి...
ఏకాత్మస్థితికి ప్రయాణించాలి...

నా పడవ గొప్పదా?
నీ పడవ గొప్పదా?
అని గొడవ పడుతూ
ఇవతలి గట్టు మీదనే కాలాన్ని వ్యర్థం చేస్తున్నాం...
సోదరా! ఏ పడవైనా ఒకటే...
అవతలి గట్టుకు చేరడం ప్రధానం...

మతశాఖలు ఎన్నైనా ఉండొచ్చు...
మతభేధాలు ఉండకూడదు...
ముందు నీ మతం నీకు అర్థమై...
అనుభవంలోకి వస్తే...
తర్వాత నీ మతస్థుడు కానివాడు అంటూ...
నీకు కనిపించడు...

ఏ మతమైనా సరే...
ఆచరణకు మించిన ప్రచారం లేదు...
నీ మతాన్ని నీవొక్కడివి...

పరిపూర్ణంగా ఆచరిస్తే చాలు...

ప్రపంచమంతా నీ వెనుకే నడుస్తుంది...

ప్రపంచమే కాదు...

ఆ దేవుడు కూడా నీ వెనుకే నడుస్తాడు...

* * **********************

50. గురువు

స్వంత ప్రశ్నకే పరిప్రశ్న అని పేరు...

ఎవరి ప్రశ్ననో  గురువును అడగకూడదు...

మన స్వంతప్రశ్నకు....

మన గురువు...

మనకు ఇచ్చిన సమాధానమే...

మనకు మోక్షదాయికం...

పరీక్షిత్తు ప్రశ్నకు...

శుకుడు ఇచ్చిన సమాధానమే భాగవతం...

ఆ భాగవతం మనకు పనికిరాదు...

అర్జునుడి ప్రశ్నకు...

కృష్ణుడు ఇచ్చిన సమాధానమే భగవద్గీత....

ఆ భగవద్గీత మనకు పనికిరాదు....

మనం మన గురుసన్నిధిలో కూర్చుని...

విన్న ఉపదేశమే మన భాగవతం, భగవద్గీత...

ఎవడి డైరీ వారిదే...

ఒకడి డైరీ మరొకడికి పనికిరాదు...

నీ డైరీనీ నీ చేతనే తెరిపించేవాడే గురువు...

మాకు గురువు లేడే...? అంటారేమో...

గురువు లేని వారు పరమాత్మ లేదా శివుడు లేదా విష్ణువు లేదా  మీకు నచ్చిన ఇతర దేవీ-దేవతలను గురువుగా భావించవచ్చు...

భౌతిక గురువు కంటే...

నచ్చిన దైవమే perfect గా...

మనల్ని గమ్యం చేరుస్తాడు...

**************************

51. అల్పత్వం

నీకు అనడం అలవాటు కాబట్టి...

నేను-నేను అని అను...

నీకు వినడం అలవాటు కాబట్టి...

నీలోన మునిగి పరమపదాన్ని (నిశ్శబ్దం) విను...

నీకు తాకడం అలవాటు కాబట్టి...

గురుపాదాలను తాకు...

నీకు రుచి చూడడం అలవాటు కాబట్టి...

ఆత్మరసాన్ని చవి చూడు...

నీకు తిరగడం అలవాటు కాబట్టి...

అహంమూలాన్ని వెతుకుతూ తిరుగు...

నీకు చూడడం అలవాటు కాబట్టి...

అంతరిక్షాన్ని వీక్షించు...

నేను భూమిపై ఉన్నాను...

భూమి అంతరిక్షంలో ఉన్నది...

కాబట్టి నేను అంతరిక్షంలో ఉన్నాను...

అన్న ఎరుకతో మనసు నిండి ఉండాలి...

యావత్తూ అంతరిక్షమే...

అందులో ఓ నలుసు భూ గ్రహం...

అందులో నేనెంత...?

అని తన అల్పత్వం తెలియగానే...

"తన" మహత్వం తెలియబడుతుంది...

మనసు అనంతంతో మమేకం అవుతుంది...

తన దేహం...ప్రపంచం...మొత్తం...

"నాలో " ఉన్నది అన్న స్ఫురణ కలుగుతుంది...

సాక్షాత్తు పరమాత్ముడు తానే అవుతాడు...

********

52. మోక్షం

అనంత వస్తువునూ పొందలేవు...

అస్సలు ఉనికే లేని దానినీ పొందలేవు...

"ఉన్నది" ఏదో ఉన్నది...

"లేనిది" యెప్పటికీ లేనిదే...

ఉన్నదానిని "ఉన్నది" అని తెలుసుకోవడం తప్ప...

పొందటం అనే క్రియ అసలు లేనేలేదు...

లేనిదానిని "లేనిది" అని తెలుసుకోవడం తప్ప...

పోగొట్టుకోవడం అనే క్రియ అసలు లేనేలేదు...

ఉన్న దానిని "ఉన్నది" అని...

లేనిదానిని "లేదు" అని...

తెలుసుకోవడమే జ్ఞానం...

ఆ జ్ఞానం వలన కలిగే స్థిమితమే స్థితప్రజ్ఞత...

ఆకాశాన్ని నేను పొందలేదు అనడం...

ఆకాశాన్ని నేను పొందాను అనడం...

రెండూ హాస్యాస్పదమే...

గురువును మోక్షం అడగడం అంటే...

ఆకాశాన్ని ఇమ్మని అడగడం లాంటిదే...

గురువు మోక్షం ఇవ్వడం అంటే...

ఆకాశాన్ని సూట్ కేస్ లో పెట్టి ఇవ్వడమే...

ఎవడైనా ఉన్నదానినే ఇవ్వగలడు...

లేనిదానిని ఎవడూ ఇవ్వలేడు...

పరిపూర్ణం ఉంది...

పరిపూర్ణవ్యక్తి ఉండడు...

సముద్రానికి కెరటమేగానీ...

కెరటానికి సముద్రం ఉండదు...

తన పరిమితుల్ని తెలుసుకోవడమే వివేకం...
దేని వలన బుద్ధి ప్రకాశిస్తోందో...
దానిని బుద్ధితో తెలుసుకోలేం...
అని తెలుసుకోవడం వరకే బుద్ధి యొక్క ప్రయోజనం...

సాధన అంటే బుద్ధితో ప్రయాణం...
సిద్ధి అంటే "బుద్ధిలేని" తనం...
బుద్ధి ఉన్నవాడు బద్ధుడు...
"బుద్ధిలేని" వాడు సిద్ధుడు...
*************************

53. ఉనికి

ఉన్నది ఒకటి అది నేను...
ఇది ఒకే వాక్యం కాదు...
ఒకే సద్వస్తువుకున్న నాలుగు పేర్లు ఇవి...
ఉన్నది(సత్యం)
ఒకటి(ఏకం)
అది (బ్రహ్మం)
నేను (స్వయం)

ఉనికి ఉన్నది ఒక్కదానికే...
దానికి ఏ పేరైనా పెట్టుకో...
ఆ పేరే అన్నిటికీ పెట్టుకో...

ఆ "ఒక్కటి" శ్రీధర్ అన్నావా...
జగత్తు కూడా శ్రీధరే...
దేవుడు కూడా శ్రీధరే...

ఆ "ఒక్కటి" జగత్తు అన్నావా...
శ్రీధర్ కూడా జగత్తే
దేవుడు కూడా జగత్తే...

ఆ "ఒక్కటి" దేవుడు అన్నావా...
శ్రీధర్ కూడా దేవుడే...
జగత్తు కూడా దేవుడే...

ఆ "ఒక్కటి" ఆహారం అన్నావా...
తినబడేది ఆహారమే...
తినేవాడు ఆహారమే...
ఉన్నదెల్లా ఆహారమే...
అరిగేది ఆహారమే...
మిగిలేది ఆహారమే...

తన శ్వాస వట్టిదే...
ప్రతీ శ్వాస వట్టిదే...
ఈశ్వరుని శ్వాస ఒక్కటే గట్టిది...
సృష్టి-స్థితి-లయాలు ఈశ్వరుని శ్వాసలే...

ఆ "ఒక్కటి" అడగొద్దు...

ఆ "ఒక్కటి" ని చెప్పలేం...

ఆ "ఒక్కటి" ని ఇవ్వలేం...

"నేను" అనేదే పరమపదం...

పరమపదం పొందడం అంటే-

"నేను" లో శాశ్వతంగా నిలిచి పోవడం...

దానికి ఇంకొక్క అక్షరం కూడా చేర్చకపోవడం...

ఏ వ్యక్తిని చూసినా, ఏ వస్తువును చూసినా...

"నేను" తప్ప ఏమీ అనుభవంలోకి రాకపోవడం...

ప్రతి పదం క్రింద గీత గీసి నేను చేర్చు...

పై పదాలన్నింటి సమూహం వ్యవహారం...

గీత క్రింద ఉన్న "నేను" లన్నీ ఒక్కటే అర్థం...

అదే పరమార్థం...

**********************

54. పగటి కల

మేలుకో-మేలుకో అని నినదించారు ఋషులు...

నేను మేలుకునే ఉన్నాను కదా...

మళ్లీ మెలకువ అంటున్నారేమిటి?

అని మనకు సందేహం...

కాబట్టి మన మెలకువ మెలకువ కాదు...

అనేది వాస్తవం...

కలలో మెలకువ లాంటిదే ఈ మెలకువ...

కల, ఇల రెండూ కలే...

కల నుండి మేలుకోవడం మెలకువ...

మెలకువ నుండి మేలుకోవడం మోక్షం...
ఆ మోక్ష స్థితిలో కేవలం నేను మాత్రమే ఉంటాను...

మెలకువ నుండి మెలకువ ఎలా కలుగుతుంది?
ఈ మెలకువ కూడా పగటి కలే...
అంటే ఈ జాగృతావస్థ కూడా పగటి కలే...
జాగ్రత్-స్వప్న-సుషుప్తి మూడూ కలే...
అనే స్థిరజ్ఞానం వలన మెలకువ కలుగుతుంది...

ఆ స్థిరజ్ఞానం ఎలా కలుగుతుంది...?
సద్గురు సన్నిధి వలనగానీ...
మంత్రోపాసన వలనగానీ...
ఆత్మనిష్ఠ వలనగానీ...
స్థిరజ్ఞానం(మెలకువ) కలుగుతుంది...

అంతేగాని పై పైన చేసే...
ఏవో కర్మకాండల వలన మెలకువ కలుగదు...
ఉత్త మాటలు వలన మెలకువ కలుగదు...

ప్రయత్నపూర్వకంగా పొందినవాడు బుద్ధుడు...
అప్రయత్నంగా పొందినవాడు రమణుడు...
ప్రయత్నంతో పొందాలనుకునేవానికి...
రమణుడు ఆదర్శం కాదు...
అప్రయత్నంగా పొందాలనుకునేవానికి...
బుద్ధుడు ఆదర్శం కాదు...
అప్రయత్నంగా పొందాలనుకునేవాళ్లు విశ్వాసులు...

ప్రయత్నపూర్వకంగా పొందాలనుకునేవాళ్లు సాధకులు...

జ్ఞానోదయం అనేది సూర్యోదయం వలె...
"అది" అప్రయత్నంగానే సిద్ధిస్తుంది...
సూర్యోదయానికి తూర్పున యెదురుచూడాలి...
జ్ఞానోదయానికి ఓర్పున యెదురుచూడాలి...
ఓర్పుతో ఉండడమే విశ్వాసం...
అదే గురుభక్తుల ముఖ్యలక్షణం...

అన్వేషణ కోసమై మీరు వెచ్చిస్తున్న శక్తి...
మీరు జీవించడానికి అవసరమైన శక్తిని...
హరించివేస్తోంది...
కాబట్టి ఆలోచించడం మాని...
జీవించడం మొదలు పెట్టు...

సహనం లేనివారికి చెప్పినవే ఈ సాధనలన్నీ...
సూర్యోదయం కోసం చేసేవే ఈ సాధనలన్నీ...
నీ సాధనలతో నిమిత్తం లేకుండా...
సూర్యోదయమైనా...
జ్ఞానోదయమైనా...
ఆ సమయానికి కలుగుతుంది...
అనేదే ఈ వ్యాస సారాంశం...

గురు సన్నిధిలో గడపడమే గొప్ప సాధన...
ఊరక ఉండమని చెప్పడమే గొప్ప బోధ...

* * *********************

55. బహిర్ముఖం-అంతర్ముఖం

నేను...

వాగుతా....

కదులుతా...

తలుస్తా...

నా ప్రతి మాటా సాగేది నిశ్శబ్దంలోకి...

నా ప్రతి కదలికా సాగేది నిశ్చలంలోకి...

నా ప్రతి తలపూ సాగేది స్వరూపంలోకి...

నేను...

బహిర్ముఖంలో మనిషిని...

అంతర్ముఖంలో ఋషిని...

నేను...

బహిర్ముఖంలో బుల్లి-పరమాత్మను...

అంతర్ముఖంలో పరమాత్మను...

నేను...

బహిర్ముఖంలో LKG ని...

అంతర్ముఖంలో PG ని...

నేను...

బహిర్ముఖంలో భాగాన్ని...

అంతర్ముఖంలో పూర్ణాన్ని...

నేను...

బహిర్ముఖంలో పాత్రధారిని...

అంతర్ముఖంలో సూత్రధారిని...

నేను...

అటైనా ఉంటా...

ఇటైనా ఉంటా...

నేను...

కళ్లు తెరిస్తే ప్రపంచం...

కళ్లు మూస్తే స్వరూపం...

"నేను" మూలమూర్తి...

"శ్రీధర్" ఉత్సవమూర్తి...

అదీ నేనే...

ఇదీ నేనే...

* * *****************

56. త్రిగుణాతీతుడు

త్రిగుణాతీతుడివి కావాలి...అని చెప్పలేదు గీత...

నీవు త్రిగుణాతీతుడివే...అని చెప్పింది గీత...

గీతలో చెప్పబడిన స్థితప్రజ్ఞలక్షణాలన్నీ...

నీవిప్పుడు క్రొత్తగా సాధించవలసినవి కావు...

నీ స్వరూపవర్ణనే చేసింది గీత...

జాగృతావస్థలో  అజ్ఞానిగా ఉన్న నీకు...
నిద్రలో జ్ఞానిగా ఉన్న నీ లక్షణాలనే వర్ణించింది గీత...

ఏనుగుకు సింహస్వప్నం లాంటిదే...
జాగృతావస్థలో  గురుదర్శనం కూడా...
అది భయంతో నిద్రనుండి మేలుకొంటుంది...
మనం అభయంతో జాగృతావస్థ నుండి మేలుకొంటాం...

స్థితప్రజ్ఞుడు జాగృతావస్థలో ఉన్నట్లే ఉంటాడు...
కానీ తాను "నిద్ర"లో ఉంటాడు...
"నిద్ర" అంటే...
'ఇదొక స్వప్నము' అన్న నిరంతర ఎరుక...
'ఇదొక స్వప్నము' అని తెలిసాక...
ఇక సుఖదుఃఖాలు తనను ఎందుకు అంటుతాయి?
అంటాయి అంటే...
నీకు ఇది కలగా తోచనట్లే...
నీవిది నిజమని భావిస్తున్నట్టే...

జగన్నాటకం అని తెలిసాక ధర్మసంకటం ఎందుకు కలుగుతుంది?
ధర్మ సంకటం కలిగిందంటే ఇదంతా స్వప్నము అని నీకు తెలియనట్లు...

జాగృతావస్థలో   త్రిగుణసహితుడివిగా ఉంటావు...
నిద్రలో త్రిగుణాతీతుడివిగా ఉంటావు...

శారీరక, మానసిక బాధలను ఆధ్యాత్మికం  తొలగించదు...
నీవు ఆధ్యాత్మికం అని చెప్పేది కూడా...

ఈ జాగృతావస్థ అనే కలలో భాగమే...

దేహగతమైన నేను...
మనసుగతమైన నేను...
అని రెండు నేనులు లేవు...
దేహము, మనసు రెండూ...
ఆత్మగతమైన నేనుకు సంబంధించినవే...

ఘటాకాశం, మఠాకాశం...
అనేది నీ విభజనే తప్పితే...
ఆకాశానికి ఘటాకాశం, మఠాకాశం తెలియదు...
ఆకాశం అవిభాజ్యమైనది...
అలాగే "నేను" అనేది అవిభాజ్యమైనది...

ఈ జాగృతావస్థ పగటి కల లాంటిదే...
అని అనుకుంటున్నామేగాని...
పగటి కలగా తోచడం లేదు...
ఉంటే కల (జాగృతావస్థ ) ఉంటుంది...
లేదంటే నిద్ర(నిజమైన మెలకువ) ఉంటుంది...

నీకు సుఖదుఃఖాలున్నాయంటే...
నీవు కలలో ఉన్నట్టే...
నీకు సుఖదుఃఖాలు రెండూ లేవంటే...
నీవు నిద్రలో ఉన్నట్టే...
ఏకకాలంలో బొమ్మ, బొరుసు చూడలేవు...
ఏకకాలంలో నిద్ర, మెలకువ ఉండలేవు...

ఈ జాగృతావస్థ కలగా తోచాలంటే ఎలా...?

ఈ కల నుండి మేలుకోవాలంటే ఎలా...?

ఈ ఎలా? అనే ప్రశ్న వేయబడుతునే వుంటుంది...

జాగృతావస్థలో ప్రశ్న తొలగదు...

నిద్రలో ప్రశ్న కలుగదు...

ప్రశ్న లేకుంటే, నీవే సమాధానం అవుతావు...

అన్యం తోచకుంటే నీవే దైవం అవుతావు...

నిద్ర నిన్ను ఆవహించినట్టే....

మెలకువా నిన్ను ఆవహిస్తుంది...

అప్పుడు మేలుకుంటావు...అంతే...

మేలుకోవడం ఎలా? అనే నీ ప్రశ్నకు...

ప్రాజెక్టు వర్క్ ఏమీ ఇవ్వడు గురువు...

నిద్రలో కల అజ్ఞానిది...

మెలకువలో నిద్ర జ్ఞానిది...

* * *******************

57. తారుమారు

శరీరము...

శరీరము ఉన్న ప్రపంచము...

దీనికి కారణమైన శక్తి...

ఈ మూడూ కలిపితే "నేను" అవుతుంది...

మూడింట్లో ఒక భాగాన్నే నేను అనుకుంటున్నాం...

మిగతా రెండు భాగాలను వేరు అనుకుంటున్నాం...

తాను కోరే ఆత్మానుభవం ఏమంటే...

ఈ మూడూ మూడు కాకముందు...

అనగా ఈ మూడూ ఏకంగా ఉన్నప్పుడు...

అనగా గాఢనిద్రలో ఉన్నప్పుడు...

ఉన్న అనుభవాన్ని...

మూడుగా అయిన తరువాత...

ఆ మూడింట్లో ఒక భాగమైన తాను...

అనుభవించాలనే ప్రయత్నమే జీవితం అయ్యింది...

మొత్తంగా ఉన్నప్పుడు ఉన్న అనుభవం కోసం...

మిగతా రెండుభాగాలలో వెతకడమే...

ఆత్మాన్వేషణ అయ్యింది...

ఒకటి మూడవడానికి ఏ సాధనా చేయలేదు...

మూడూ ఒకటవడానికి కూడా...

ఏ సాధనా చేయవలసిన అవసరం లేదు...

అని తెలిసి స్థిమితంగా ఉండిపోతే...

అదే స్థితప్రజ్ఞత...

అలాంటి స్థితప్రజ్ఞతే రమణులది...

కానీ ప్రక్కవారు ఆ స్థిమితాన్ని చూసి...

"వారేదో పొందేశారు" అని...

వ్యాఖ్యానాలు చేసేస్తుంటారు...

రమణులు పొంది, ఊరక ఉండడం కాదు...

"పొందలేం" అని నిశ్చయంగా తెలిసి...

ఊరక ఉండడం అది...

మెలకువలో వైవిధ్యాన్ని అనుభవించు...

నిద్రలో  ఏకత్వాన్ని అనుభవించు...

రూపాయి నాణెంగా ఉన్నా...

రూపాయి చిల్లరగా ఉన్నా...

రూపాయి విలువ మారలేదు...

అని తెలిపేదే ఆధ్యాత్మికం...

ఉన్నది "ఒక్కటే" అంటే...

అది నిరాకారోపాసన అవుతుంది...

ఉన్నది "ఒక్కడే" అంటే...

అది సాకారోపాసన అవుతుంది...

కలకనేవాడికి...

కలలో ఉన్న తన గురించి తెలుసును...

కానీ...

కలలోని తనకు...

కలను కనే తనను గురించి తెలియదు...

కలలోని తాను జీవుడు...

కలను కనే తాను దేవుడు...

ఎవ్వనిచే...పద్యం యొక్క అర్థం ఏమంటే...

తనకు తానే శరణుచెందటం...

ఎవ్వనిచే జనించు జగము - నాచేత నాలోనే పుడుతోంది...

ఎవ్వని లోపల నుండు - నా లోపలనే ఉంటోంది...

లీనమై యెవ్వనియందుడిందు -. నాలోనే కలిసిపోతోంది...

పరమేశ్వరుడెవ్వడు - నేను.

మూలకారణంబెవ్వడు - నేను.

అనాది మధ్య లయుడెవ్వడు - నేను.

సర్వము తానైన వాడెవ్వడు - నేను.

వాని నాత్మభవు నీశ్వరుని - నన్ను

శరణంబు వేడెదన్ - నేను శరణువేడుతున్నాను...

'నేను' అని వ్రాసి ప్రక్కన గీత గీసేయ్...

ఆ గీతలో ఏమి వ్రాసినా సరిపోతుంది...

నేను అనేది - స్వరూపం - శివుడు.

గీతలో ఉండేది - స్వభావం - పార్వతి.

ఏది మెలకువో...దానిని నిద్ర అంటున్నాం...

ఏది నిద్రో...దానిని మెలకువ అంటున్నాం...

ఏది జ్ఞప్తియో...దానిని మరపు అంటున్నాం...

ఏది మరపో...దానిని జ్ఞప్తి అంటున్నాం...

ఏది చైతన్యమో...దానిని జడం అంటున్నాం...

ఏది జడమో...దానిని చైతన్యం అంటున్నాం...

తారుమారుగా ఉన్నదే జీవితం...

మళ్లీ తారుమారు చేయడమే ఆధ్యాత్మికం...

* * ************************

58. మొదటి నేను-రెండవ నేను

'శ్రీధర్ నేను' అనేది మరపులో ఉండాలి...
కానీ అది జ్ఞాపకంగా ఉంది...
'నేను ఆత్మను' అనేది జ్ఞాపకంగా ఉండాలి...
కానీ అది మరపులో ఉంది...

'నేను ఆత్మను' అనే మరపు వలన...
"శ్రీధర్" అనే తప్పుడుభావం జొరబడి...
"నేను కాని నేనును" పట్టుకొని...
నేను-నేను అంటూ పెత్తనం చెలాయిస్తోంది...

'అదే(బ్రహ్మమే) నేను' అని అనడానికిగాని...
'ఇదికాదు' అనడానికి గాని...
ఈ మిథ్యానేనుకు(శ్రీధర్ కు)అధికారం లేదు...
శ్రీధర్ ఓ భావన అంతే...

ఆత్మ విచారణ అంటే...
పరమగు ఆత్మను విచారించమని కాదు...
ఈ మిథ్యానేనును నీవెవరు? అని ప్రశ్నించడం...
తద్వారా
మధ్యలో వచ్చింది...
మధ్యలోనే లేకుండా పోతుంది...
అందుకే దానికి 'మిథ్య' అనే పేరొచ్చింది...
'శ్రీధర్ నేను' అనే నేను కేవలం భావం...మిధ్య.
'నేను శ్రీధర్' అనే "నేను" కేవలానుభవం...సత్యం.

ఇక్కడ రెండు నేనులు ఉన్నాయి...

1.నేను శ్రీధర్ అని నేను అంటుంది.

2.శ్రీధర్ నేను అని శ్రీధర్ అంటాడు.

ఒకటి సర్వగతమైన నేను.

మరొకటి వ్యక్తిగతమైన నేను.

మొదటి నేను అహంస్వరూపం.

రెండవ నేను అహంకారరూపం.

మొదటి 'నేను'కు ఎవరి ఆధారమూ, దేని ఆధారమూ అవసరం లేదు.

అది శ్రీధర్ ఉన్నా ఉంటుంది శ్రీధర్ లేకున్నా ఉంటుంది.

రెండవ నేను శ్రీధర్ ఉంటేనే ఉంటుంది.

శ్రీధర్ లేకపోతే ఉండదు.

ఆత్మ అంటే? మొదటి నేను.

రెండవ నేను? అహంకారం.

కాబట్టి...

ఉనికి లేని శ్రీధర్ కూ మౌనమే గతి...

ఉనికి ఉన్న నేనుకూ మౌనమే గతి...

ఇక

మాటలకు విలువెక్కడ?

మాటలకు ఉనికెక్కడ?

* * ***************************

59. సాక్షాత్కారం-భగవంతుని శరీరమే ఈ ప్రపంచం

హరిమయముగాని ద్రవ్యము పరమాణువులేదు...

జగత్తనేది భగవంతునిచే సృష్టింపబడింది కాదు...

మనకు ఓ శరీరం ఉన్నట్టు...

భగవంతుని శరీరమే ఈ ప్రపంచం...

భగవంతుడు పంచముఖేశ్వరుడు...

పంచముఖాలు అంటే పంచభూతాలు...

'నేను' అని జీవుడూ అంటాడు...

దేవుడూ అంటాడు...

జీవుని నేను వ్యష్టిగా ఉంటుంది.

దేవుని నేను సమిష్టిగా ఉంటుంది.

బ్రహ్మమూ అనాదే.

ప్రపంచమూ అనాదే.

రెండూ ఒకే వస్తువు.

రూపాయినాణేన్ని చిల్లరగా మార్చుకుని

వాడుకుంటే అది ప్రపంచానుభవం.

చిల్లరను రూపాయినాణెంగా మార్చుకుని

దాచుకుంటే అది దైవానుభవం.

కుండను చూస్తున్నాను అని...

నీవు అనుకునేటప్పుడు కూడా...

నీవు చూసేది మట్టినే...

జగత్తును చూస్తున్నాను అని...

నీవు అనుకునేటప్పుడు కూడా...

నీవు చూసేది భగవంతుణ్ణే...

ఈ అవగాహనే సాక్షాత్కారం...

అంతేగాని భగవంతుడు ఓ రూపంగా వచ్చి...

నీ యెదుటపడడం కాదు...

ఈ జగత్తు మాయా కాదు...

మిథ్యాకాదు...

కలా కాదు...

జగత్తు సాక్షాత్తు ఈశ్వరస్వరూపమే...

అని గ్రహించడమే సాక్షాత్కారం...

దీనిని ఈశ్వరస్వరూపంగా చూడకపోవడమే...

మహామాయ...

జీవ-జగత్తు-ఈశ్వరుడు మొత్తం కలిపి...

ఒకే వస్తువు...

ఈ మూడింట్లో ఒక వంతుగా(జీవుడుగా)మాత్రమే...

తానుండడం వలననే ఈ సమస్యలు...

జగత్తు మిథ్య అని ఎందుకన్నారంటే...

సత్యాన్ని సత్యంగా చూడక...

జగత్తును మాత్రమే సత్యం అనుకుంటున్నావు... కాబట్టి...

నీ దృష్టిని ఆధారసత్యం వైపుకు మళ్లించడానికి....

తత్కాలికంగా 'జగత్తు మిథ్య' అని... బోధించవల్సివచ్చిందే తప్ప...

జగత్తు నిజానికి మిథ్య కాదు....

జగత్తు కూడా సద్వస్తువులో అంతర్భాగమే...

గాఢనిద్రలో ఏమీ తెలియకపోయినా...

భావాలు, దృశ్యాలు ఉండని కారణంగా...

తన స్వరూపమే అయిన "హాయి"...

తేటతెల్లంగా అనుభవంలోకి వస్తుంది...
అందువల్లనే గాఢనిద్రానుభవమే...
అనగా ఏ అనుభవమూ లేకపోవడమే
దైవానుభవం...

అంటే దాని అర్థం...
ఎప్పుడూ పడుకుని నిద్రపొమ్మని కాదు...
సమూహంలో ఏకాంతమే గాఢనిద్రాస్థితి...
మెలకువలో నిద్రాస్థితియే ముక్తస్థితి...
* * ******************

60. ప్రధమస్థానం

అహంకారం చెడ్డలక్షణమేమీ కాదు...
మీరు ఎలా ఉన్నారో అలానే ఉండండి...
అలా ఉంటేనే...
భగవంతుడు మీకు నిర్దేశించిన పాత్రను...
బహు చక్కగా మీరు పోషిస్తున్నట్టు...
ఒక్కొక్కరం ఒక్కొక్క పాత్రను తీసుకొచ్చాం...
ఈ భూమ్మీదకు...
స్టేజీ మీదకు వచ్చాక పాత్రను...
పాత్రస్వభావాన్ని...
పాత్ర యొక్క డైలాగులను...
మార్చడం కుదరదు...

తనదే...

తానే...

అయి ఉన్న ఆత్మస్వరూపం...

కనబడనంతగా...

మరిచిపోయేంతగా...

చేసుకున్నామంటే....

అంతగా ఆత్మను వదిలి...

బాహ్యవిషయాలనే దుప్పట్లతో...

ఆత్మను కప్పేశామన్న మాట...

మళ్ళీ ఆ దుప్పట్లను తొలగించాలంటే...

ప్రాపంచిక వ్యవహారాలను...

అంతకంతకు తగ్గించుకోవాలి...

అవన్నీ అశాశ్వతమనే వైరాగ్యాన్ని...

మనసులో నింపుకోవాలి...

అనేకం వదిలి...

ఏకం వైపుకే మనసును మళ్లించాలి...

నేను-నాది తుడిచేయాలి...

అనగా రెంటినీ ఏకం చేయాలి...

సదా ప్రపంచాన్ని నిరసిస్తూ ఉండాలి...

ఇక్కడే ఉన్న ప్రపంచాన్ని వదిలేసి, ఇక్కడే ఉన్న దైవానికి ప్రధమస్థానం ఇవ్వాలి...

అంటే మీతో సహా ప్రపంచంలో ఉన్న అన్నింటి యొక్క నామ-రూప-క్రియలను వదిలేయాలి...

అప్పుడే ఆ దుప్పట్లు తొలగి...

ఆత్మ తేటతెల్లమౌతుంది...

దైవానికి ప్రధమస్థానం ఇచ్చినప్పుడు మాత్రమే...

తత్త్వం బోధపడగలదు...

దేవునికి ప్రధమస్థానం ఇవ్వడమే 'తపస్సు' .

ఆత్మకు సమానమైన...

విలువగలిగిన...

వస్తువు ప్రపంచంలో ఏదీలేదు...

మొత్తపు ప్రపంచం కూడా దానితో సరితూగదు...

కాబట్టి ఆత్మకు నీవిచ్చే విలువ...

ప్రపంచంలో ఇక దేనికీ నీవు ఇవ్వకూడదు...

అప్పుడే నీ ఉపాసన సఫలం అవుతుంది...

నిష్కామకర్మ...

భగవద్భక్తి...

జ్ఞానవిచారణం....

అందులో ప్రధాన మార్గాలు...

మూడింటిలోనూ 'గురువు' పాత్ర అమోఘం...

మన ఆధ్యాత్మిక ప్రయాణాన్ని సులభతరం చేస్తుంది.

గురువులేని ప్రయాణం...

నావికుడు లేని నావలో ప్రయాణం చేయడం లాంటిది....

సద్గురు వైపుకు నీ మనసు తిరిగిందంటే...

అదే నీ మనసుకు చివరిదినం...

ఆత్మను సాక్షాత్కరించుకున్న శుభదినం...

*******************

61. కర్త-కర్మ-క్రియ

భగవదిచ్ఛయే...

"తలరాత" గా...

"ప్రారబ్ధం" గా...

"విధి" గా...

"పురుషప్రయత్నం" గా ఉండేది...

నీవు స్వయంగా చేస్తున్నట్టు ఉండే కర్మలు కూడా...

భగవదిచ్ఛలో అంతర్భాగమే...

నేను చేస్తున్నాను...

అని అంటాడు అజ్ఞాని....

నా 'ద్వారా' చేయబడుతున్నది....

అని ఉంటాడు జ్ఞాని...

వ్యవహారాలన్నీ ఇద్దరికీ సమం...

అందులో తేడా ఏమీ ఉండదు...

ఒక దర్శకుడు తనే ఓ విషాదగాథను వ్రాసి..

అందులో తానే పేదవాని పాత్రను ధరించి...

ఓ సినిమా తీశాడు...నిర్మాత కూడా తానే...

ఆ సినిమాను స్వంత థియేటర్ లో ...

ఒక్కడే కూర్చొని ఆ సినిమాను చూస్తూ...

ఆ సినిమా తాను తీసిందే అని మరచిపోయి...

ఆ పేదవాని పాత్రను వేసింది తానే అనేది కూడా మరచిపోయి...

ఆ కథలో తను లీనమై...

ఆ పేదవాని కష్టాలను చూసి దుఃఖిస్తున్నాడు...

ఇప్పుడు చెప్పండి సృష్టి ఎవరిదో....

ప్రారబ్ధకర్మ ఎవరిదో.....

కర్త-కర్మ-క్రియ మూడూ భగవంతుడే.

దేవీసూక్తంలో...

అమ్మ స్వయంగా నేనే చెబుతున్నాను...

అని చెప్పిన మాటలు చూడండి...

నేను ఉగ్రుణ్ణి చేయాలనుకొంటే ఉగ్రుడిగా...

వేదవేత్తను చేయాలని తలంచితే వేదవేత్తగా...

ఋషిగా తీర్చిదిద్దాలని భావించితే ఋషిగా...

మేధావిగా చేయ నిర్ణయించితే మేధావిగా...

ఆయా వ్యక్తులను నేనే చేస్తాను...

ఒకవేళ వారు ఆమె కంటే భిన్నులయి ఉంటే...

అది పక్షపాతమై ఉండేది...

కాని ఆమె స్వయంగా విభిన్నరూపాలను ధరించి...

విభిన్న పాత్రలలో నటిస్తూ ఉంది...

* * ***********************

62. విసుగుదల(boredom)

మనం కాలక్షేపం Timepass కొరకు

రకరకాల సాధనాలను ఏర్పరచుకుని ఉన్నాం...

ఇన్ని ఉన్నా  సమస్య ఉండనే ఉంది...

boredom గా feel అవుతూనే వుంటాము...

కానీ చెట్లు చేమలు, మిగతా జీవజాలమంతా...

ఏ విధమైన అలజడీ లేకుండా...

యేండ్ల తరబడి అలా హాయిగా ఉంటున్నాయి...

వాటికి boredom సమస్యేలేదు...

కారణం...

అవి సహజత్వానికి దగ్గరగా ఉండడం...

మనం సహజత్వానికి దూరం అవడం...

మనిషి మనిషిగా జీవించడమే సహజత్వం...

ఇంకేదో కావాలని...

ఇంకేదో పొందాలని...

చేసే ప్రయత్నం వలనే...

సహజత్వానికి దూరం అవడానికి కారణం...

Boredom కు ఇదే ప్రధాన కారణం...

బోర్ గా ఉందని పశువూ అనదు, ఋషీ అనడు...

లోపల 'కోరిక' ఉన్నవారే...

బయట 'బోర్' గా ఉన్నవారు...

* * *

విసుగుదల(boredom) అనేది...

ఓ అంతులేని గొయ్యి...

ఇప్పుడు నీవు చేస్తున్నదాని కంటే...

ఎక్కువ ఆసక్తికరంగా...

ఎక్కువ ప్రయోజకరంగా...

ఎక్కువ అర్థవంతంగా చేయదగ్గది...

మరేదో ఉందనుకున్నంతకాలం...

నిన్ను నీవు విసుగుదల నుండి...

బయటపడేసుకునే మార్గమే లేదు...

* * *

నేను మరోలా కావడానికి ఏమీలేదు...

నేను నేనుగానే ఉంటాను...

నేను నేనుగానే ఉన్నాను...

అని నేనున్నప్పుడు...

నేను పరిపూర్ణమనిషిని అవుతాను...

పరిపూర్ణమనిషియే ఋషి...

* * ********************

63. సృష్టి ఎందుకు?

అందరికీ కలిసి ఒక ప్రపంచం లేనే లేదు...

యెవడి ప్రపంచంలో వాడున్నాడు...

యెవడి స్వప్నప్రపంచం వాడిదే అన్నట్టుగా...

నీ కలలో ఇదే విధమైన సంభాషణే జరిగిందనుకో...

ప్రశ్నించేవాడు...

సమాధానమిచ్చేవాడు...

ఇద్దరూ నీవే కదా అవుతావు....

ఎవడి కలకు వాడే కర్త.

ఎవడి జగత్తుకు వాడే కర్త.

స్వప్న జగత్తుకు...

జాగ్రత్ జగత్తుకు...

ఇంచుకైనా భేదం లేదు...

భగవంతుడు ఎందుకు సృష్టించాడు?

అని ప్రశ్నించేవాడు ఆ భగవంతునికి అభిన్నం.

ఆడించేవాడూ భగవంతుడే...

ఆడేవాడూ భగవంతుడే...

తన మూలం వెళ్లి...

తనలో కలిసిపోయి...

తాను  ఒక్కడే శేషించినప్పుడు...

ఆ తాను భగవంతుడే అని అనుభవమాయ్యాక...

ఆ ఏకాత్మస్థితిలో...

సృష్టితో పాటు...

ప్రశ్న, ప్రశ్నించేవాడు కూడా మాయమౌతారు...

"ఎందుకు" అన్న ప్రశ్నకు...

ఖచ్చితమైన సమాధానం...

వాచా ఎప్పటికీ దొరకదు...

తాను భగవంతునిలో అంతర్భాగమై ఉన్నప్పటికీ...

తాను "అదే" అయినప్పటికీ....

మనకు తెలియడం లేదు...

ఒకడు గూబ గుయ్యమనేట్టు చెంపమీద కొట్టాడు...

ఎందుక్కొట్టావు? అని అడిగితే...

నా బలమేమిటో నీకు తెలియడానికి అన్నాట్ట...

ఈ సృష్టి యెందుకు చేశావు?

అని భగవంతుణ్ణి అడిగితే...

నేనొకడ్ని ఉన్నానని...

నీకు తెలియడానికి అన్నాట్ట...

ఇది హాస్యాస్పదంగా అనిపించినప్పటికీ...

సృష్టి కారణమేమి? అన్న ప్రశ్నకు...

ఇంతకు మించి సమాధానం లేదనిపిస్తుంది...

గొంతెత్తి పాట పాడకుంటే...

అతడు గాయకుడు అని ఎలా తెలుస్తుంది?

వీణ పై స్వరాల్ని మీటకుంటే...

అతడు వైణికుడు అని ఎలా తెలుస్తుంది?

రాతిని శిల్పంగా మలచుకుంటే...

అతడు శిల్పి అని ఎలా తెలుస్తుంది?

చిదాకాశమనే తెరపై విశ్వసృష్టిని గీయకుంటే... అతడు భగవంతుడు అని ఎలా తెలుస్తుంది?

బ్రహ్మ మానసపుత్రుడైన వశిష్ఠమహర్షి...

పుట్టుకతోనే శుద్ధబ్రహ్మజ్ఞాని...

అతనికి బంధంగానీ, దుఃఖంగానీ తెలియవు...

నీవు గడియకాలం అజ్ఞానానికి లోనవుదువుగాక...

అని అకారణంగా, ఓ సదుద్దేశంతోనే...

వశిష్ఠునికి శాపం పెట్టాడు బ్రహ్మ...

వశిష్ఠుడు అజ్ఞానవశుడై విచారవదనంతో...

తన అకారణ దుఃఖాన్ని పోగొట్టమని ప్రార్థించగా...

అందుకు బ్రహ్మ చేసిన ప్రబోధమే యోగవాశిష్ఠం...

కష్టసుఖాలనేవి ఎలా ఉంటాయో...
అనుభవంలో ఉన్నప్పుడే...
అందుండి బయటపడడానికి అనువైన బోధను...
లోకులకు చేయగలిగే సమర్థత...
వశిష్ఠునికి వస్తుందనేది బ్రహ్మగారి సదుద్దేశము...

మితం అనేది తెలియకపోతే
అమితం అనేది ఎలా తెలుస్తుంది?
అంతం అనేది తెలియకపోతే
అనంతం అనేది ఎలా తెలుస్తుంది?
బాధ అనేది తెలియకపోతే
ఆనందం అనేది ఎలా తెలుస్తుంది?
అజ్ఞానం అనేది తెలియకపోతే
జ్ఞానం అనేది ఎలా తెలుస్తుంది?

భగవంతుడు చేసిన సృష్టికార్యము కూడా అలాంటిదే...
ఏకంగా ఉన్న తాను ఏకంగా ఉండక...
అనేకమైనాడు అది లీల అయ్యింది....
తిరిగి అనేకం నుండి ఏకం వైపుకు ప్రయాణమయ్యాడు...
అది జీవితం అయ్యింది...

"ఎందుకు?" అని అడిగితే,
లోకవత్ లీలా కైవల్యం అంటుంది బ్రహ్మసూత్రం.
"లీల" అన్నాక ఇంకేం మాట్లాడగలం?

"లీల యెందుకు?" అని అడగలేం.

ఆనందం కోసం ఆడేది క్రీడ.

ఆనందంగా ఉండి చేసేది లీల.

ఎందుకు దుఃఖిస్తున్నావు?

అని అడుగుతామే గాని...

ఎందుకు ఆనందంగా ఉన్నావు? అని అడగం...

దుఃఖానికి కారణం ఉంటుందేగాని...

ఆనందానికి కారణం ఉండదు...

శిశువు అకారణ ఆనందానికి బాహ్యచేష్టలే కేరింతలు...

పరమేశ్వరుని అకారణ ఆనందానికి బాహ్యరూపమే ప్రపంచం...

పరమేశ్వరుని ఆనందసాగరంలో తేలియాడే నురగలు

ఈ ద్వంద్వాలు, త్రిపుటులు...

* * ************************